ప్రియమైన నీకు.....

రెవిన్యూ ఆఫీసులో సెక్షన్ ఆఫీసరుగా పనిచేస్తున్న సుబ్బారావుకు ఎప్పటినించో ప్రేమలేఖ వ్రాయాలనే కోరిక బలీయంగా ఉంది. నిజంగా ప్రేమించి పెళ్లి చేసుకోవాలనే సుబ్బారావు కోరిక, నాయనమ్మ అనారోగ్యంతో కలగానే మిగిలి సుబ్బలక్ష్మితో పెళ్లి జరగడంతో కల్లయింది, భిన్నాభిప్రాయాలు గల సుబ్బారావు, సుబ్బలక్ష్మిల సంసారం చప్పగా సాగుతుండటంతో పెళ్లి అయి ఆరేళ్లు అయినా ప్రేమలేఖ వ్రాయాలనే కోరిక బలంగానే ఉండిపోయింది.

దీనితో తన సెక్షనులో పనిచేస్తున్న నలుగురి ఆడవాళ్లను, వారి దిన చర్యలను గమనించడం మొదలు పెట్టాడు. సెక్షనాఫీసరు అవసరం ఉన్న సురేఖ, సుభాషిణి, శ్రీదేవి, నీలవేణిలు ఆఫీసు పని విషయంలో సుబ్బారావుతో కాస్త చనువుగానే ఉంటారు. వీరిలో ఎవరో ఒకరికి ప్రేమలేఖను వ్రాయాలనుకున్నాడు.

ఈ నలుగురిలో సురేఖ, నీలవేణిలకు పెళ్లికాగా శ్రీదేవి, సుభాషిణిలకు ఇంకా పెళ్లి కాలేదు. దీనితో శ్రీదేవి, సుభాషిణిలను నిశితంగా పరిశీలించడం మొదలుపెట్టాడు. శ్రీదేవి అన్న పోలీసు డిపార్టుమెంటులో పని చేస్తున్నాడని తెలియడంతో లిస్టులోంచి శ్రీదేవి పేరును తొలగించాడు. మగవారి వేధింపుల నుండి రక్షించుకునే విద్యలలో ఆరితేరిందని తెలుసుకున్నాక సుభాషిణి పేరును పూర్తిగా మరచిపోయాడు.

సురేఖ, నీలవేణిల భర్తలు ఇరువురు ఉద్యోగాల నిమిత్తం వేరే చోట ఉండటంతో వీరిలో ఎవరో ఒకరికి ప్రేమలేఖ వ్రాయాలని నిర్ణయించుకున్నాడు. సురేఖ భర్త వేరే ఊరిలో పని చేస్తుండగా నీలవేణి భర్త విదేశాలలో ఉన్నాడు. మంచి రోజు చూసుకుని ప్రేమలేఖ పని మొదలు పెట్టాడు.

ప్రేమలేఖను ముందుగా ఎవరిపేరు వ్రాయకుండా ప్రియమైన నీకు.....తో మొదలు పెట్టి మొత్తానికి పూర్తి చేశాడు. మరుసటి రోజు ఉదయం ఆఫీసులో ఆడిట్ ఉండటంతో హడావుడిగా బయలుదేరి వెళ్లిపోయాడు. రాసిన ప్రేమలేఖ సంగతి మధ్యాహ్నం గుర్తుకు రావడంతో జేబులో చూసుకున్నాడు. కానీ రాత్రి వదిలిన చొక్కా జేబులో దానిని వదలి వచ్చేనన్న సంగతి గుర్తుకు రాగానే ఈ విషయం భార్యకు తెలిస్తే కొంప కూలుతుందని వెంటనే ఇంటికి వచ్చాడు.

ఇంట్లోకి రాగానే ఇల్లు శుభ్రంగా కడిగి ముగ్గులు పెట్టి ఉండి పండుగ వాతావరణం కనిపించేసరికి ఒకింత ఆశ్చర్యపోవడం సుబ్బారావు వంతైంది. ఏమిటీ ఈ రోజు ఏ పండుగా అని లోపలికి వచ్చి సుబ్బలక్ష్మి కోసం వంటింట్లోకి చేరుకోగానే సుబ్బలక్ష్మి ఆనందంతో పాదాభివందనం చేసేసరికి సుబ్బారావు ఆశ్చర్యానికి గురైనాడు.

ఏమండీ..... నేను ఇంతకాలం మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. నాయనమ్మ మాట కాదనలేక మీరు నాకు తాళి కట్టారే తప్ప.... నాపై ప్రేమ ఉందనుకోలేదండి.... నాది మూర్ఖత్వం అని ఈ రోజే తెలిసిందండీ..... ఇంతకాలం మిమ్మల్ని కష్టపెట్టాను అని పశ్చాత్తాపంతో సుబ్బలక్ష్మి కన్నీళ్లు పెట్టడంతో సుబ్బారావు నిశ్చేష్టుడైపోయాడు.

తాను జీవితంలో లేక లేక రాసిన ప్రేమలేఖ సరైన చోటుకు చేరి జీవితం ఆనంద దాయకంగా మారినందుకు సుబ్బారావు తన్మయత్వం చెందాడు.

❁